ఊపిరితిత్తులను కాపాడుకోండి

- పెరుగుతున్న బాధితులు
- అక్టోబర్ నెల 'హెల్దీలంగ్ మంత్'



గుంటూరు మెడికల్: ఊపిరి తీసుకోవడం కష్టమవుతోంది. పల్లె పట్టణం తేడా లేకుండా కలుష్యం సమస్య వెంటాడుతోంది. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల వినియోగం స్వేచ్ఛమైన గాలి లేకుండా చేస్తోంది.

గాలికి ఆపసోపాలు..

ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు పచ్చదనం తగ్గిపోతోంది. గాలి కాలుష్యం పెరిగిపోతోంది. మనిషి శ్వాస తీసుకోవడానికి ఆపసోపాలు పడాల్సి వస్తుంది. శ్వాస తీసుకునేందుకు ఊపిరితిత్తులు ఎంతో కీలకం. మనిషి సాధారణంగా ఒక్క రోజులో దాదాపు 25,000 సార్లు ఊపిరి తీసుకుంటాడు. మనం పీల్చే గాలిలో ఆక్సిజన్, నత్రజని, తక్కువ మొత్తంలో ఇతర వాయువులు, తెలియాడే బ్యాక్టీరియా, వైరస్, వాతావరణంలో ఉండే వివిధ రకాల కాలుష్య కారకాలు ఉంటాయి. ఊపిరితిత్తులు ఆక్సిజన్ శరీరం అంతా పంపిణీ చేస్తాయి. ఆధునిక జీవన శైలి వలన ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నమై ఊపిరి తీసుకోవడం కష్టమైపోయి కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు నెలను 'హెల్దీలంగ్ మంత్'గా నిర్ణయించి ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

వీరికి రిస్క్ ఎక్కువ...

ధూమపానం చేసేవారు, పొగతో కూడిన ప్రాంతాల్లో పనిచేసేవారు, పొగాకు ఉత్పత్తులు వినియోగించేవారు, ఫ్యాక్టరీల్లో పనిచేసేవారు, వడ్రంగి పనులు చేసేవారు, పొగతో కూడిన వాహనాలను రిపేర్లు చేసేవారు, చిన్న పిల్లలు, వృద్ధులు, ఎక్కువగా ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

వ్యాధి గుర్తించడం ఎలా?

ఎక్కువగా దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, ఛాతి పట్టివేయడం లాంటి లక్షణాలు కనిపిస్తే అది సీఓపీడీ వ్యాధిగా గుర్తించాలి. తరచుగా జలుబు చేయడం, ఒళ్లు దురద, కళ్లు మంటలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు, సరిపడక పోవడం లక్షణాలను ఎలర్జీగా గుర్తించాలి. జ్వరం, కళ్లెతో కూడిన దగ్గు, శ్వాస తీసుకునేటప్పుడు ఛాతి నొప్పి ఉంటే దానిని నిమోనియా వ్యాధిగా భావించాలి. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, వంటి లక్షణాలు కనిపిస్తే ఊపిరితిత్తులకు వచ్చే క్షయ వ్యాధిగా గుర్తించాలి. దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లంగ్ క్యాన్సర్ లక్షణాలు. పొడి దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు ఉంటే ఊపిరితిత్తులకు వచ్చే ఐఎల్‌డీ వ్యాధిగా గుర్తించాలి.

ముందస్తు చర్యలు తీసుకోవాలి....



ఊపిరితిత్తుల వ్యాధులను ముందస్తు జాగ్రత్తలతో చాలా వరకు నివారించవచ్చు. ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచే క్యారెట్, ఆపిల్, వెల్లుల్లి, నారింజ, దబ్బపండు, అల్లం, క్యాప్సికంతోపాటుగా వేడినీరు తాగాలి. గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, పొగతాగడం, విడనాడాలి. పొగ, దుమ్ముధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉండాలి. 60 ఏళ్లు పైబడిన వారంతా క్రమం తప్పకుండా ఫ్లూ, నిమోనియా వ్యాక్సిన్లు వేయించుకోవడం వలన ఊపిరితిత్తుల జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం, ప్రాణాయామం, చేయడం వలన ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

–డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

క్లుప్తంగా

ఆధునిక వసతులతో రైతు బజార్



నెహ్రూనగర్: నగర ప్రజల సౌకర్యార్థం బృందావన్ గార్డెన్స్ కుందుల రోడ్డులో అధునాతన వసతులతో రైతు బజార్ నిర్మాణం చేపట్టనున్నట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం మార్కెటింగ్ శాఖ, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి రైతు బజార్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బజార్ నిర్మాణానికి నగర పాలక సంస్థ స్థలాన్ని కేటాయించే ప్రక్రియ పూర్తయిందని, మార్కెటింగ్ శాఖ నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పనులను త్వరితగతిన ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను కోరారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన గంగాధర్



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన సందర్భంగా డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని సచివాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలసిన వారిలో బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, సీనియర్ నాయకులు ఈమని మాధవరెడ్డి, యువమోర్చా నాయకులు జంధ్యాల సాయి రాధాకృష్ణ, తదితరులు వున్నారు. ఈ సందర్భంగా గంగాధర్‌ను మంత్రి సత్కరించారు.

విద్యార్థినికి బలసాని చేయూత



గుంటూరు రూరల్: పేద విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ల్యాప్‌టాప్ బహూకరించారు. మండలంలోని ఏటుకూరూ బైపాస్ రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో కాకుమాను మండలం, పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన వల్లూరి ప్రశాంతి అనే బీటెక్ విద్యార్థినికి అందించారు. బలసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఎటు చూసినా అన్నింటిని ప్రైవేటుపరం చేస్తూ కేవలం చంద్రబాబు తమ వర్గానికి వేల కోట్లు దోచి పెడుతున్నారని ఆరోపించారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి అమరావతి అభివృద్ధి పేరుతో తమ వర్గానికి దోచి పెడుతున్నారని పేర్కొన్నారు.

వీఆర్‌ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలి



పెదకాకాని: వీఆర్‌ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు గత 8 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు పెంచలేదని, జీతాలు పెంచక పోవడంతో కుటుంబాలు అర్థాకలితో బ్రతుకుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచి వీఆర్‌ఏ కుటుంబాలను ఆదుకోవాలని, కనీస వేతనం ఇవ్వాలని, వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలని కోరారు. వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టులు భర్తీ చేసి, వీఆర్‌ఏలకు 70 శాతం పోస్టులు కేటాయించాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరారు. ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదని పెరిగిన ధరలతో కుటుంబాలు సతమతమవుతున్నాయని వీఆర్‌ఏల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు ఏళ్లుగా పే స్కేల్ జీతాలు చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. ఈనెల 13, 14 తేదీలలో విజయవాడలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు, 15వ తేదీ జరిగే ధర్నా కార్యక్రమాల్లో వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సహాయకుల సంఘం మండల కార్యదర్శి బుల్లా సురష్‌కుమార్, ఫకీరయ్య పాల్గొన్నారు.

లీకులు ఏర్పడిన పైపులకు మరమ్మతులు చేపట్టండి

కమిషనర్ పులి శ్రీనివాసులు



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో తాగునీటి పైపు లైన్లకు లీకులు ఏర్పడితే వెంటనే మరమ్మతులు నిర్వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బ్రాడీపేట, శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు, డొంక రోడ్డు, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. తొలుత బ్రాడీపేటలో తాగు నీటి పైపులైన్ లీకు గమనించి, వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. సైడు కాలువల్లో తాగు నీటి పైపులు ఉంటే వాటిని తొలగించాలని చెప్పారు. శంకర్ విలాస్ ఆర్వోబీ ఫిల్లర్స్ నిర్మాణం కోసం తవ్విన మట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సర్వీస్ రోడ్లలో రాకపోకలకు అనువుగా తొలగించాలని కోరారు. అనంతరం డొంక రోడ్డు, శ్రీనగర్‌లో కమర్షియల్ వ్యర్థాలను రోడ్ల మార్జిన్లలో వేయకుండా పర్యవేక్షణ చేయాలని, పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు ఉదయం ప్రధాన రహదారులు శుభ్రం చేసి, డోర్ టూ డోర్ వ్యర్థాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ వేణు, ఏసీపీ రెహమాన్ పాల్గొన్నారు.

వాగ్గేయకార సంగీత, నృత్య ఉత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో వాగ్గేయకార సంగీత, నృత్య ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించనున్న ఉత్సవాలను డాక్టర్ వి.రాధిక జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం కళాకారులతో వాగ్గేయకార కీర్తనల గానం నిర్వహించారు. డాక్టర్ కె.మృణాళిని, ఎం.మాధవికృష్ణ కల్యాణ రాగవర్ణం, క్షేత్రయ్య పదం, జావళి, ఎంవై.శేషురాణి సావేరి వర్ణం, సీతారామారావు రాగమాలిక శ్రావ్యంగా గానం చేశారు. పలువురు కళాకారులు వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. సాయంత్రం నృత్య కార్యక్రమాలను అదనపు సొలిసిటర్ జనరల్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫర్ హైకోర్ట్ ఆఫ్ ఏపీ చల్ల ధనుంజయ, రేడియాలజిస్ట్ డాక్టర్ జి.జాహ్నవి జ్యోతి ప్రజ్వలన చేశారు. వాగ్గేయకార వైభవం నృత్యాన్ని ప్రారంభించారు. నాట్యమయూరి డాక్టర్ బిందుఅభినయ్, శిష్య బృందం నృత్యాభినయం చేయగా అలరించింది. కార్యక్రమంలో సన్మండలి అధ్యక్షులు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, లలితదేవి, మీనాక్షి, కార్యదర్శి ఏవీ.మంగాదేవి, విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

రోలర్ స్కేటింగ్‌లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇటీవల మంగళగిరిలో నిర్వహించిన గుంటూరు జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శనివారం లక్ష్మీపురంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ 3వ తరగతి విద్యార్థి కార్తికేయ మూడు బంగారు పతకాలు, 2వ తరగతి విద్యార్థి అధర్వ బంగారు, రజత పతకాలను సాధించినట్లు చెప్పారు. అదే విధంగా మనస్విని రెండు రజత, ఒక కాంస్య పతకంతో పాటు అర్జ ఒక రజత, కాంస్యం, నాట్యశ్రీ రజతం, 8వ తరగతి విద్యార్థి సాయి సహస్రద్ మూడు కాంస్య పతకాలను గెలుపొందారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు స్కేటింగ్ శిక్షకులు కె.కార్తీక్, షేక్ ఇమ్రాన్, జి. శరత్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, కో–ఆర్డినేటర్లు టి.శ్రీదేవి, దిల్ జహాన్, ఇన్‌చార్జ్ కె.హరిప్రియ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

నగరంపాలెం: స్థానిక మెడికల్ కళాశాల రోడ్డులోని ఏపీ ఎన్‌జీవోఎస్ కల్యాణ మండపంలో శనివారం ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఆధ్వర్యంలో రాష్ట్ర/ జిల్లా శ్రేష్ట విద్యా సేవా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలు నేర్పడం ముఖ్యమని అన్నారు. అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ, అసోసియేషన్ తరపున అవార్డులు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, ఎన్నారై ఈడీ పిడికిటి తిలక్‌బాబు, మిర్చియార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు, రాష్ట్ర కోశాధికారి సాదినేని శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర, జిల్లా ఉపాధ్యాయులను ప్రశంస పత్రాలు, అవార్డులతో సత్కరించారు.

కోడిపందేల నిర్వాహకుల అరెస్టు

ప్రత్తిపాడు: కోడి పందేలు నిర్వాహకులను వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వట్టిచెరుకూరు పోలీస్ స్టేషను పరిధిలోని వింజనంపాడు– చమళ్లమూడి గ్రామాల మధ్య వ్యవసాయ భూముల్లో కోడి పందేలు నిర్వహించబోతున్నారన్న సమాచారంతో వట్టిచెరుకూరు సీఐ రామానాయక్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పొలాల్లో పందెపు కోళ్లతో ఉన్న ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు పందెం కోళ్లు, రెండు మొబైల్స్, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడమే లక్ష్యంగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో నిఘా పెట్టి దాడులు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

చిత్ర కళాకృతులకు ఆహ్వానం

నగరంపాలెం: ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వహించనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా మన అమరావతి పేరుతో ఒక అద్భుతమైన చిత్ర కళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో తెలుగు సంస్కృతి, తెలుగు భాషా వైభవం, ఆంధ్రప్రదేశ్ కీర్తి, పర్యావరణం/ప్రకృతి సౌందర్యం వంటి అంశాలను ప్రతిబింబించే చిత్ర కళాకృతులను ప్రదర్శించేందుకు వర్ధమాన, ప్రముఖ చిత్రకారులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలకు అవకాశం లేదని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొనే ప్రతి కళాకారునికి ప్రశంసాపత్రం, మహాసభల అభినందన పత్రం అందిస్తామని తెలిపారు. చిత్రకారులు తమ చిత్రాలను ఈ ఏడాది డిసెంబర్ (2025) 15 లోపు, ఎస్.విజయ్‌కుమార్, సమన్వయకర్త - చిత్ర కళా ప్రదర్శన మన అమరావతి, 202, సత్యవతి హోమ్స్, కనకమేడల కన్వెన్షన్ ఎదురు, ముఖ్య రోడ్, ఎస్‌విఎన్ కాలనీ, గుంటూరు–522006 (9849503860) చిరునామాకు పంపించాలని తెలిపారు. గీసిన చిత్రాలు పరిమాణం గరిష్ఠం 24రు30 ఉండాలని, ఏదైనా ఫ్రేమ్ చేసి ప్రదర్శనకు సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రదర్శనలోని చిత్రాలు విక్రయం జరిగితే, ఆ మొత్తాన్ని ఆయా కళాకారులకు అందిస్తామని తెలిపారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్లు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో హెడ్ నర్సుగా పనిచేస్తున్న పలువురికి గ్రేడ్–2 నర్సింగ్ ఆఫీసర్లుగా పదోన్నతి లభించింది. గుంటూరు జీజీహెచ్‌లో హెడ్‌నర్సుగా పనిచేస్తున్న ఉమారాణి, మాధవిలను పదోన్నతి కల్పించి గుంటూరు జీజీహెచ్‌లోనే గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు నియమించారు. వందనాదేవిని మంగళగిరి గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) డాక్టర్ డి.శోభారాణి శుక్రవారం ముగ్గురు హెడ్ నర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. డెప్యూటీ డైరెక్టర్ బండి పాల్ సుధాకర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీక్రాంత్‌లు కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. పదోన్నతి పొంది గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా శనివారం జీజీహెచ్‌లో విధుల్లో చేరిన ముగ్గురిని పలువురు అభినందించారు.

రాజధానిలో మైనారిటీలకు 200 ఎకరాలు కేటాయించాలి

టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్

గుంటూరు వెస్ట్: రాజధాని అమరావతిలో మైనార్టీల అభివృద్ధి కోసం ఒకేచోట 200 ఎకరాలు కేటాయించి అందులో అన్ని సదుపాయాలు కల్పించాలని టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక అరండల్‌పేటలోని పార్టీ కార్యాలయంలో మైనారిటీల సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో కె.యం.ఇ హుస్సేన్, బాజీ మాష్టారు, షేక్ ఆదం షఫీ, అబ్దుల్ ఖాదర్, షేక్ జాన్ సైదా, ఉప్పల శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెం బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

గుంటూరు రూరల్: రూరల్ మండలం తురకపాలెంలో నాలుగు నెలలు కాలంలో 29 మరణాలు సంభవించటం ఎంతో బాధాకరమని బాధిత కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను అలక్ష్యం చేయటం బాధాకరమన్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

గుంటూరు రూరల్: జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలోని రైతులకు, అధికారులకు, సిబ్బందికి శనివారం సమాచార హక్కు చట్టం 2025పై అవగాహన సదస్సును నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంలో నిర్వహించిన సదస్సులో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ సమాచారం కోసం ఏవిధంగా దరఖాస్తు చేసుకోవచ్చు, దరఖాస్తు దారుని హక్కులు, సమాచారాన్ని ఎన్ని రోజులలో అందించాలి అనే విషయాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయం పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, సత్యనారాయణ అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నూరిఫాతిమా, రాజనారాయణ తదితరులు

పట్నంబజారు: ఉప్పెన తలపించేలా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేయాలని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా పార్టీ ముఖ్యనేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లతో సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక శాతం మంది ప్రజలు ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకుంటారని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. వైద్య వ్యవస్థను పెంపొందించి తద్వారా పేదలకు వైద్యాన్ని చేరువ చేయాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన మహోన్నత కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. 17 మెడికల్ కళాశాలల్లో ఏడు మెడికల్ కళాశాలలు ఇప్పటికే పూర్తయి, అందుబాటులోకి వచ్చిన పరిస్థితులు ఉన్నాయని వివరించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే వచ్చిన వ్యక్తులు వ్యాపారం చేస్తారు తప్ప, పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎంతటి పోరాటాలకైనా వైఎస్సార్ సీపీ వెనుకాడదని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ కేవలం వ్యాపార దృక్పథంతోనే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండి పడ్డారు. పేదలకు వైద్యాన్ని, విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జననేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, ఓర్సు శ్రీనివాసరావు, సురసాని వెంకటరెడ్డి, సత్తెనపల్లి రమణి, సుభాని, సలీమ్, వేలూరి అనిల్‌రెడ్డి, చంటి, రాణా ప్రతాప్, జాఫర్, రాందాస్, దూపాటి సాల్మన్, చీదర్ల రాజేష్ పాల్గొన్నారు.

జీవితంలో సవాళ్లను స్థితప్రజ్ఞతతో ఎదుర్కోవాలి

డీసీపీ సరిత



భాష్యంలో మాట్లాడుతున్న పోలీస్ అధికారి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును స్థిత ప్రజ్ఞతతో ఎదుర్కొన్నప్పుడే ఆనందకరమైన జీవితం మీ సొంతమవుతుందని ఎన్టీఆర్ కమిషనరేట్ డీసీపీ కేజీవీ సరిత అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సమత మమత క్యాంపస్‌లో జరిగిన భాష్యం స్పార్క్ హర్ సమ్మిట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జీవితంలో లక్ష్యం ఏమిటో గుర్తించడంలో స్పష్టత రావాలని కోరారు. నేటి ప్రపంచంలో మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న అకృత్యాలు, నేరాలపై జాగరుతతో వ్యవహరించాలని విద్యార్థినులకు సూచించారు. మీరు కలలు కన్న ప్రపంచాన్ని మీరే సృష్టించుకోవాలన్నారు. ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ మహిళకు గౌరవం ఇంటి నుంచే మొదలవ్వాలని అన్నారు. అప్పుడే ఈ వివక్ష సమాజం నుండి దూరమవుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ అనాదిగా మహిళలపై సమాజంలో దాగి ఉన్న వివక్ష అనే దృక్పథం మారాలన్నారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ ఈ లోకంలో మహిళా శక్తి ఎంతో అద్భుతమైనదన్నారు. మీరు మీ సంకల్ప బలంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరన్నారు. ప్రతి పుట్టుకకు ఒక అర్థం ఉంటుందని దానిని గుర్తించి ముందుకు వెళ్లిన నాడే దానికి సార్థకత ఏర్పడుతుందని వివరించారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అతిథులకు ఆహ్వానం పలికారు. ముందుగా అంతర్జాతీయ, జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన భాష్యం విద్యాసంస్థల విద్యార్థినులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికల బహూకరించారు. అదేవిధంగా భాష్యం విద్యా సంస్థలకు చెందిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన లోగోలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రత్తిపాడు: కమ్యూనికేషన్, కోడింగ్ స్కిల్స్‌ను విద్యార్థులు నేర్చుకోవాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(కిట్స్) కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. 2025–26 మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకునేలా ఉండాలన్నారు. జాబ్ మార్కెట్లో కమ్యూనికేషన్ స్కిల్స్, విత్ కోడింగ్ స్కిల్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందని చెప్పారు. కేవలం ఉపాధి దిశగా కాకుండా విద్యార్థులు తమ స్వశక్తితో, తెలివితేటలతో పారిశ్రామికవేత్తలుగా స్థిరపడటానికి కావాల్సిన నైపుణ్యాలను తమ కళాశాలలో అందిస్తామని చైర్మన్ తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు అదిరేటి స్టెప్పులతో, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

14న ఇళ్ల స్థలాలు మంజూరు కోరుతూ ధర్నా

పెదకాకాని: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 14వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య కాలనీలో శనివారం రాత్రి ఇంటింటికి ప్రచారం, గ్రూప్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అర్హులైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేశారని, ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చేసిన వాగ్దానం అమలు చేయాలని అన్నారు. పెదకాకానిలో సుందరయ్య కాలనీ, వడ్డెర కాలనీ, ఎస్టీ కాలనీ, జాన్ హస్పర్ కాలనీ, స్వర్ణపూరి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ తదితర కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఆయా కాలనీలలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి బి.బాబూరావు, కమిటీ సభ్యులు బి.సాంబయ్య, కే రాఘవయ్య, ఏ నాగేశ్వరావు, షేక్ హసీనా, కె.రమ్య, ఎస్.మల్లేశ్వరి, ఆర్.వెంకటరమణ, సుందరయ్య పాల్గొన్నారు.